

బాలిక అదృశ్యం


సనా (ఫైల్)

సుభాష్‌నగర్: ఇంటి ముందు ఆడుకుంటున్న ఓ బాలిక అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయిబాబానగర్ పాండుబస్తీకి చెందిన ఖైరత్ అలీ కుమార్తె సనా(07) ఆదివారం ఉదయం ఇంటి ముందు ఆడుకుంటూ కనిపించకుండా పోయింది. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా బాలిక ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారంటీలే గెలిపిస్తాయి'


రంగారెడ్డినగర్‌లో కరపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

రంగారెడ్డినగర్: కాంగ్రెస్ ఆరు గ్యారంటీలే లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపిస్తాయని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఆదివారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని పంచశీల కాలనీ, రంగారెడ్డినగర్, చెన్నారెడ్డినగర్‌లలో శ్రీశైలంగౌడ్ ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్, బీజేపీలు ఒకటేనని అన్నారు. ఆ రెండు పార్టీలు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలని చూస్తున్నాయని పేర్కొన్నారు. మల్కాజ్‌గిరి నుంచి సునీతారెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు శివకుమార్, నాయకులు మోతె శ్రీనివాస్‌యాదవ్, వెంకట్, సుబ్బారెడ్డి, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

నిజాంపేట్: కాంగ్రెస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని.. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్ 5వ డివిజన్ పరిధి ఆల్విన్ కాలనీకి చెందిన పలువురు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి హన్మంతరెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, కొలన్ రాజశేఖర్‌రెడ్డి, ఇంద్రజిత్, అరవింద్ నాయుడు, బల్వంత్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రఫత్, తులసీదాస్, రవీందర్ పాల్గొన్నారు.

పాదచారులకు మజ్జిగ పంపిణీ

చింతల్: పాదచారులు దాహార్తిని తీర్చేందుకు ఆదివారం చింతల్ ప్రధాన రోడ్డులో బస్టాండ్ వద్ద దేవాంగ సేవా సంఘం ఆధ్వర్యంలో మజ్జిగను పంపిణీ చేశారు. రెండు రోజులుగా విపరీతంగా పెరిగి వేసవి ఉష్ణోగ్రతల నేపథ్యంలో మజ్జిగ పంపిణీ చేపట్టినట్లు సేవా సంఘం సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు యర్రా భీమారావు, కార్యదర్శి నిమ్మన రవికుమార్, కోశాధికారి బూడిద శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి నల్లగుట్ట లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కూన శ్రీనివాస్‌గౌడ్

కుత్బుల్లాపూర్: గాజులరామారం మెట్‌కానిగూడలోని నల్లగుట్ట లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 22, 23 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. ఆదివారం బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను కేకేఎం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఇంద్రసేన గుప్తా, ఆలయ కమిటీ సభ్యులు బుచ్చిరెడ్డి, మహేందర్‌రెడ్డి, శ్రీరాములు, యాదగిరి, సంజీవరెడ్డి, పెంటారెడ్డి, మోహన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, యాదగిరియాదవ్, లక్ష్మయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.





వృద్ధుడి అదృశ్యం


పాపయ్య (ఫైల్)

కుత్బుల్లాపూర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లపోచంపల్లికి చెందిన కొమ్ము పాపయ్య(60) రోజు మాదిరిగానే గత 30వ తేదీన ఉదయం 7గంటలకు సమీపంలోని టీస్టాల్‌కు ఛాయ్ తాగేందుకు వెళ్లాడు. మధ్యాహ్నం వరకు పాపయ్య ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు టీస్టాల్, చుట్టు పక్కల వెతికినా అతని ఆచూకీ తెలియరాలేదు. వృద్ధుడి కుమారుడు గోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కరాటేతో ఆత్మరక్షణ, శారీరక దృఢత్వం

కుత్బుల్లాపూర్: కరాటేతో ఆత్మరక్షణతో పాటు శారీరక దృఢత్వం పెంపొందుతాయని బూమ్స్ అకాడమీ నిర్వాహకుడు మాస్టర్ కృష్ణ అన్నారు. ఆదివారం గాజులరామారంలో విద్యార్థులకు కలర్ బెల్ట్ ఎగ్జామ్ నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి విభాగాల వారీగా బ్రౌన్, వైయిట్, ఆరంజ్, పర్పల్ బెల్టులను అందజేశారు. ప్రస్తుతం వేసవిలో 'సమ్మర్ క్యాంపు' నిర్వహిస్తున్నామని తెలిపారు. స్కేటింగ్, కరాటేలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు మాస్టర్ పేర్కొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

సుభాష్‌నగర్: కొంపల్లి మున్సిపల్ దులపల్లిలోని జడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో 2004-05 బ్యాచ్ చెందిన టెన్త్ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 19 సంవత్సరాల తర్వాత ఒకే వేదికపై విద్యార్థులు కలిసి తమ తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. చిన్ననాటి విద్యార్థులు ఎవరికి ఏ కష్టం వచ్చినా అందరం అండగా ఉండాలని ప్రతిజ్ఞ చేశారు.



